# యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

- పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా
- జనగామలో అభివృద్ధి చేసి చూపిస్తా
- ఇక్కడ రౌడీలు, గూండాలకు స్థానం లేదు
- ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించండి
- బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- వడ్లకొండ, పెద్దపహాడ్, గోపరాజుపల్లిలో విస్తృత ప్రచారం
- ఘనస్వాగతం పలికిన ప్రజలు, శ్రేణులు

జనగామ రూరల్, నవంబర్ 17 : యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయమని, జనగామలో రౌడీలు, గూండాలకు స్థానం లేదని బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని వడ్లకొండ, పెద్దపహాడ్, గోపరాజుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ, కోలాట ఆటలు, ఒగ్గుడోలు విన్యాసాలు, కనకడప్పుల మోతలు, బోనాలు, మంగళహారతులతో పల్లెపల్లెనా ఆయనకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా పల్లా బైక్ నడిపారు. ప్రతి గడపకు తిరుగుతూ, ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విస్తృత ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రౌడీరాజ్యం, గూండా రాజ్యం వచ్చే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చుట్టూ రౌడీలు, హంతకులు తిరుగుతున్నారని, రేవంత్‌రెడ్డి చేప్తే వినడానికి జనగామ ప్రజలు సిద్ధంగా లేరని ఆయన మాట్లాడుతుంటే ప్రజలు సభ నుంచి బయటికి పోయారని గుర్తు చేశారు. జనగామ యువతకు ఉపాధి కల్పించేందుకు ఇక్కడ ఇండస్ట్రీయల్ కారిడార్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. దీంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, పామ్ ఆయిల్ ఇండస్ట్రీ, నర్సింగ్, పాలిటెక్నిక్, పారామెడికల్ కళాశాలలను నిర్మించుకుందామని చెప్పారు. ఇక్కడ అనేక పరిశ్రమలు నెలకొల్పేందుకు పాటుపడుతానన్నారు. ప్రతి గ్రామాన్ని సమగ్రాభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్న కథలు నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. వారు పరిపాలన చేస్తున్న రాష్ట్రాల్లో అమలు చేసి ఇక్కడ అమలు చేస్తామంటే ఇక్కడి ప్రజలు నమ్ముతారని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఎన్నికలు పూర్తికాగానే గొల్లకుర్మలకు గొర్రెల యూనిట్లు, పింఛన్లు వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేవిధంగా కృషి చేస్తానన్నారు. అవసరం అయిన చోట మరిన్ని నిధులు మంజూరు చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గ్రామాల్లో క్రీడామైదానాలు ఏర్పాటుకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఇక్కడ దండిగా ధాన్యం, పాలఉత్పత్తి ఉందని రైతులను మరింత ప్రోత్సహిస్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నేను నాన్ లోకల్ అంటున్నారని, తరిగొప్పుల పక్కనే ఉన్న గ్రామం మాది అని, జనగామకు దగ్గరలోనే ఉందన్నారు. అభివృద్ధిలో తనతో పోటీ పడాలని అన్నారు. ప్రతి గ్రామం బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతోందని, 50వేల మెజార్టీతో తన గెలుపు ఖాయమన్నారు.

కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బక్క నాగరాజుయాదవ్, మండల శ్రీరాములు, గాడిపల్లి ప్రేమలతారెడ్డి, డా.రాజమౌళి, జనగాం వీరేందర్‌రెడ్డి, దర్మా సంతోష్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, ఎంపీపీ మేకల కళింగరాజు, జడ్పీటీసీ నిమ్మతి దీపిక, మండల పార్టీ అధ్యక్షుడు బైరగోని యాదగిరిగౌడ్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు చినబోయిన రేఖ, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు బొల్లం శారద, బండ లక్ష్మి, మండల బీఆర్ఎస్ కార్యదర్శులు నిమ్మల స్వామి, ఎడ్ల శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షులు నామాల భాస్కర్, గుండ్లపల్లి రవి, నక్క సత్యనారాయణ, నాయకులు కాసా భాస్కర్, రామ్మోహన్‌రెడ్డి, దండెబోయిన సత్యనారాయణ, నరేందర్, రైతుబంధు సమితి సభ్యులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వడ్లకొండలో పల్లాకు స్వాగతం పలుకుతున్న ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు


వడ్లకొండలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


7వ వార్డులో ప్రచారం చేస్తున్న పల్లా నీలిమ

## జనంతో మమేకమై..

- ఇంటింటా ప్రచారం చేపట్టిన 'పల్లా' సతీమణి నీలిమ
- పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం
- ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు

జనగామ, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : గెలుపే లక్ష్యంగా ఇప్పటికే పల్లెపల్లె చుట్టేసిన జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అటు గ్రామాలు, ఇటు పట్టణ వార్డుల్లో కలియతిరుగుతుండగా ఆయన సతీమణి నీలిమ, కుమారుడు అనురాగ్‌రెడ్డి జనగామ, చేర్యాల మున్సిపల్ పరిధిలో ఇంటింటా ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కొద్దిరోజులుగా పల్లా సతీమణి నీలిమ వార్డుల్లో ప్రతి వీధికి వెళ్లి జనంతో మమేకమవుతూ మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తూ ఆశీర్వాదం తీసుకుంటున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని కలిసి నీలిమ ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలుగా జనం వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని, కారు గెలిచి.. కేసీఆర్ సారు సీఎంగా, బీఆర్ఎస్ సర్కారు వస్తేనే అభివృద్ధి సాధ్యమని ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. నీలిమను మహిళలు తమ ఇళ్లకు ఆహ్వానించి బొట్టుపెట్టి దీవెనలు అందిస్తున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 7వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి సతీమణి ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తుండటంతో గులాబీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం నెలకొన్నది. 2, 3, 4, 13, 16, 18, 19 వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు వాంకుడోత్ అనిత, పగిడిపాటి సుధ, మల్లిగారి చంద్రకళ, బండ పద్మ, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి ఆధ్వర్యంలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. అదేవిధంగా 17వ వార్డులో గులాబీశ్రేణులు ఇంటింటా ముమ్మరంగా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముద్దసాని సరళాశ్రీనివాస్‌రెడ్డి, వార్డు అధ్యక్షులు ఎనుగుతల సోమేశ్వర్, వార్డు మహిళా అధ్యక్షురాలు దామెర మల్లికాంబ, కార్యదర్శి గంద్రా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు జోగారెడ్డి, వార్డు యూత్ అధ్యక్షులు చింతల క్రాంతికుమార్, మార్క ప్రవీణ్, మంజుల తదితరులు ప్రతి ఇంటికెళ్లి తెలంగాణ ప్రభుత్వంలో కేసీఆర్ అందించిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను అందిస్తూ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి పల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 20వ వార్డులో కౌన్సిలర్ జూకంటి లక్ష్మి శ్రీశైలం ఆధ్వర్యంలో జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వార్డు అధ్యక్షులు దామెర రాజు, ప్రధాన కార్యదర్శి జాయ శ్రీశైలం, పట్టణ ప్రధాన కార్యదర్శి జిట్ట శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ నాగులపల్లి శ్రీశైలం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చిన్నం నర్సింహులు, నోముల శ్రావణ్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ప్రకృతి దినోత్సవ వేడుకలు

జనగామ చౌరస్తా, నవంబర్ 17 : జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్ వారి సహకారంతో జాతీయ ప్రకృతి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మానవ జీవితంలో ప్రకృతి పాత్ర అనే అంశంపై జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బీ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ ప్రకృతిని రక్షించుకొని మనం ప్రకృతికి అనుగుణంగా జీవించాలని సూచించారు. ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానం ధర్మకంచ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి కే ఐశ్వర్య, ద్వితీయ స్థానం వావిలాల జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎస్ వైష్ణవి, తృతీయ స్థానం ఖిలాషాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి కిరణ్మయి పొందారు. వారికి నగదు బహుమతి అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఐశ్వర్య రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్‌వో తోట రాజు, రమేశ్, గౌసియాబేగం, సోషల్ ఫోరం జిల్లా ఇన్‌చార్జీలు మొర్రి కనకయ్య, వెంకటేశ్వర్లు, భవాని పాల్గొన్నారు.


విజేతలతో నిర్వాహకులు

## పని చేసే నాయకుడికే పట్టం కడుదాం

### 'పల్లా' గెలుపు కోరుతూ బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం


ప్రచారం చేస్తున్న కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

బచ్చన్నపేట, నవంబర్ 17 : పని చేసే దమ్మున్న నాయకుడికే జనగామ నియోజకవర్గంలో పట్టం కడుదామని కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత కొండి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బచ్చన్నపేటలో ఉపసర్పంచ్ కొండి హరికృష్ణ, వార్డు సభ్యుడు కామిడి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోరుతూ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు అయిన పల్లా గెలుపుతో జనగామ నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయని అన్నారు. కారుగుర్తుకు ఓటేసి రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. అదేవిధంగా మరోపక్క సర్పంచ్ వడ్డేపల్లి మల్లారెడ్డి, నాయకులు వడ్డేపల్లి ఉపేందర్‌రెడ్డి, గంధమల్ల నరేందర్, షబ్బీర్, కైసర్, సిద్ధులు, జావీద్, వినోద్, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, కొన్నెలో సిద్ధారెడ్డి, శివకుమార్, ఆంజనేయులు, లక్ష్మణ్‌గౌడ్, సిద్ధిరాములు, ఆలింపూర్‌లో నర్సిములు, దాసారం శ్రీనివాస్, తొగిటె బాల్‌రెడ్డి, బాలరాజు, శ్రీరాములు, షరీఫ్, చంద్రమౌళి, మురళి, తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, భిక్షపతి, గోపి, యాదిరెడ్డి, కొమురయ్య, నర్సింహా, అంబదాసు, రాంరెడ్డి పాల్గొన్నారు.

## దర్గాలో ప్రార్థనలు

జనగామ చౌరస్తా, నవంబర్ 17 : బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్ రోడ్డులోని హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలి చిల్లా ముబారక్ దర్గాలో ఆ పార్టీ మైనార్టీ నాయకుడు యాకూబ్ పాషా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యాకూబ్ పాషా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు చెంచారపు పల్లవి, మైనార్టీ నాయకులు అంజద్, రహీం, నసీరుద్దీన్ పాల్గొన్నారు.


దర్గాలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## 'ఎన్నికల విధులపై అవగాహన కల్పించాలి'

జనగామ చౌరస్తా, నవంబర్ 17 : శాసన సభ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని జనగామ జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్ శివలింగయ్య సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మైక్రో అబ్జర్వర్లు, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్స్, పోలింగ్ రోజున రిస్క్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణ ఎలా ఇవ్వాలనేదానిపై మాస్టర్ ట్రెయినర్స్‌తో ఎన్నికల అధికారి శివలింగయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి ఎలక్షన్ విధులు నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే పలుమార్లు శిక్షణనిచ్చినట్లు తెలిపారు. జిల్లాలో 33మంది మాస్టర్ ట్రెయినర్స్‌తో సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించినట్లు చెప్పారు. పీవో, ఏపీవోలు రెండో దశ ట్రెయినింగ్ కోసం సిద్ధంగా ఉన్నట్లు శివలింగయ్య తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నోడల్ అధికారులు అనిల్‌కుమార్, వినోద్‌కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, రాము, రంగాచారి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య

## పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

బచ్చన్నపేట, నవంబర్ 17 : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తహసీల్దార్ విశాలాక్షితోపాటు ఎంపీడీవో రఘురామకృష్ణ శుక్రవారం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. దబ్బగుంటపల్లిలో తాగునీరు, మరుగుదొడ్లు, కరెంటు సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ఎంపీడీవో క్షుణ్ణంగా పరిశీలించారు. ఇటీవల పోలింగ్ కేంద్రాల ఎదుట సీసీ కెమెరాలను బిగించినట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు కనకయ్య పాల్గొన్నారు.